కదలని 'ఈ-ఆటోలు'.. కార్మికులకు కష్టాలు

- మూలకు చేరిన చెత్త తరలింపు ఆటోలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అదనపు భారంలో పారిశుద్ధ్య సిబ్బంది



తోపుడు బండ్లతో చెత్తను డంపింగ్ చేస్తున్న కార్మికులు



షెడ్డులో మూలకు చేరిన ఈ-ఆటోలు

పొన్నూరు: ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపట్టిన కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అక్కరకు రాకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో అవి కాస్త నీరుగారి పోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త తొలగింపు కోసం క్లాప్ పథకం కింద అన్ని మున్సిపాలిటీలకు ఈ-ఆటోలను కేటాయించారు. కార్మికులకు కష్టాన్ని తగ్గించడంతో పాటు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వేగంగా జరిగే విధంగా చర్యలు చేపట్టి గత ప్రభుత్వం ఈ ఆటోలను ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం ఈ-ఆటోలు కదలని స్థితిలో ఉన్నాయని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు.


శరవేగంగా చెత్త సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో పొన్నూరు మున్సిపాలిటీకి 6 ఈ-ఆటోలను కేటాయించారు. వాటిని పట్టణంలోని 31 వార్డులలో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణ కోసం వినియోగించారు. అప్పట్లో ఈ-ఆటోల వినియోగంతో చెత్త సేకరణ శరవేగంగా జరిగింది. ప్రస్తుతం కొన్ని ఈ-ఆటోలు మూలకు చేరడంతో కార్మికులపై అదనపు భారంతో పాటు చెత్త సేకరణ కూడా నత్తనడకన సాగుతోంది. అధికారుల వైఫల్యం, పారిశుద్ధ్య సిబ్బంది స్వార్థ ప్రయోజనాల కారణంగా అవి కొన్ని రోజులకే మరమ్మత్తులకు గురై మూలకు చేరినట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. మరమ్మత్తులకు నోచుకోక నెలల తరబడి షెడ్డుకే పరిమితమయ్యాయి.

పారిశుద్ధ్య కార్మికులపై అదనపు భారం..

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య కార్మికులపై అదనపు భారం తప్పడం లేదు. ఒక్కో ఆటోను రూ.లక్షలు వెచ్చించి గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. 6 ఈ-ఆటోల్లో 4 ఆటోలు మూలకు చేరగా 2 మాత్రమే వినియోగిస్తున్నట్లు సమాచారం. దీంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం చూపుతోంది. తోపుడు బండ్లతోనే చెత్త సేకరణ చేస్తున్నారు. పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 32 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం పర్మినెంటు 20 మంది, 110 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులు 31 వార్డులలో పనులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో చెత్త తరలించే వాహనాలు అందుబాటులో లేకపోవడంతో కార్మికులపై పని భారం పెరిగింది. ఈ సమస్యపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు..



మరమ్మత్తులకు గురైన ఈ ఆటోలను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు ఈ-ఆటోల అవసరం ఉంది. కార్మికులకు పని భారం తగ్గించేందుకు ఆటోలను త్వరితగతిన అందుబాటులోకి తెస్తాం. కార్మికుల కష్టాన్ని తగ్గించి శరవేగంగా పట్టణ శుభ్రతకు పాటుపడతాం.

– ముప్పాళ్ల రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

విపత్తులతో రైతులు నష్టపోతున్నారు

- పంట నష్టం పరిశీలనకు అధికారులెవరూ రాలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పడిపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న రామకృష్ణ

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈదురు గాలులు, వడగండ్ల వానలు, ఇతర విపత్తుల వల్ల రైతులు పంట నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం స్పందించి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో అకాల వర్షంతో నేలకొరిగిన అరటి తోటలను ఆయన రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ఎకరాలలో వరి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం జరిగిందని.. మరో 2 వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ఈ లెక్కలు ప్రభుత్వమే చెప్పిందని అన్నారు. సీఎం చంద్రబాబు 24 గంటల్లో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా పంటలకు నష్టం జరిగితే ఒక్క అధికారి కూడా రాకపోవడం, పంటలను పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, సుహాస్, గుంటక సాంబిరెడ్డి, జవ్వాది సాంబశివరావు, సింగయ్య, రైతులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు

గుంటూరు రూరల్: సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కార్మికులలోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఐటీయూ కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అడవితక్కెలపాడు పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో మే డే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా సీఐటీయూ కృషి చేస్తుందన్నారు.

భవిష్యత్తులో నివాస ప్రాంతాల్లో ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు నృత్యాలు చేశారు. నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు షేక్ మస్తాన్‌వలి, షేక్ ఖాసింషహీద్, ఆది నికల్సన్, షేక్ బాషా, సిపాన పద్మనాభుడు, బి.సుకన్య, ట్యూషన్ సెంటర్ టీచర్ కె.సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసులు అందజేస్తున్న నన్నపనేని శివాజీ

పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని.. వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని.. దానిలో భాగంగా పంచాయితీ కార్యదర్శికి మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు ఆశాలకు కూడా వర్తింపచేయాలని, ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదని అన్నారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆశా వర్కర్స్ కె.కోటేశ్వరమ్మ, ప్రసన్నకుమారి, కె.కీర్తి, టి.బాజమ్మ, శివకుమారి, జి.ప్రమీల, జి.సుధారాణి, ఝాన్సీ, కనకం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదకాకాని పంచాయితీ కార్యదర్శి మునునూరు రాజారాంకు పారిశుద్ధ్య కార్మికులతో కలసి సమ్మె నోటీసులు అందజేశారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో!



రోడ్డు మధ్యలో గుంతలు తీసి పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

గుంటూరు రూరల్: మురుగు కాలువలు, ఇతర మరమ్మత్తుల కోసం రోడ్డును తవ్వి వదిలేశారని.. గుంతలను పూడ్చి తమ ఇబ్బందులను తీర్చాలని నల్లపాడు కాలువ సెంటర్ శ్రీనివాసకాలనీ ప్రజలు వేడుకుంటున్నారు. గత రెండు నెలల క్రితం కాలనీలోని మురుగు కాలువల మరమ్మత్తులు, నిర్మాణాల కోసం రోడ్డును గుంతలుగా తవ్వారని.. వాటిని పూడ్చడం మరిచారని అన్నారు. ప్రధాన రహదారికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నామని, రెండు మూడు రోడ్లను దాటి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని వాపోతున్నారు. అత్యవసర సమయంలో వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేసి తమను ఆదుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



కోటేశ్వరరావుకి వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు

నగరంపాలెం: రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృభాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కార్యక్రమాలు, రాష్ట్ర సదస్సుల్లో చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నామని అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాహిత్య సభలు, పుస్తక ఆవిష్కరణకు జిల్లా గ్రంథాలయాలు ఉచితం లేదా సాధారణ ఛార్జీలతో అప్పగిస్తామన్నారు. అనంతరం గోనుగుంట్లను సత్కరించి, గ్రంథాలయ ఉద్యమ పుస్తకాలు అందించారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రతినిధులు చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్‌కుమార్, సిహెచ్.సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ఠ, ఎస్ఎం సుభాని పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నెహ్రూ నగర్: కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం, పారిశుద్ధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబుని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 8వ శానిటరీ డివిజన్‌లో కార్మికుల హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, సదరు కార్మికులు విధుల్లో లేరని గుర్తించినట్లు చెప్పారు. సదరు డివిజన్‌లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో కూడా శానిటరీ ఇన్ స్పెక్టర్ రాంబాబు నిర్లక్ష్యంగా కనిపిస్తోందని చెప్పారు. 8 డివిజన్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.బాబుని నియమించామన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి



ఫిరంగిపురం: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఫిరంగిపురం తాలూకాయూనిట్ కార్యవర్గ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష కార్యక్రమానికి హాజరయ్యి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జూన్‌లో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాలూకాయూనిట్ అధ్యక్షుడు కొండపల్లి సుదర్శనరాజు పాల్గొన్నారు.

గ్రంథాల ఆవిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కవి డాక్టర్.కత్తి పద్మారావును మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కలిసి శుభకార్యానికి ఆహ్వానించారు. అనంతరం 'సావిత్రి బాయి ఫూలే' మనదేశం మన రాజ్యాంగ గ్రంథాలను మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, కవి విల్సన్, కత్తి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



చేబ్రోలు: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్ కుమార్ అన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలను సాధించటానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆశా వర్కర్లకు యూనిఫాం చీరలను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు అబ్రహం లింకన్, శైలజ, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జీజీహెచ్‌లో కంటి వైద్య పరికరాలు ప్రారంభం

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో కంటి సమస్యతో వచ్చేవారికి కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు రూ.65 లక్షలు విలువ చేసే కంటి వైద్య పరికరాలు వితరణగా అందజేశారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. జింకానా రూ.20 లక్షల వైద్య పరికరాలు వితరణగా అందజేశారన్నారు. బుధవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య పరికరాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జింకానా చైర్మన్ ఆఫ్, బోర్డు ఆఫ్ ట్రస్టీ డాక్టర్ త్రిపురనేని రవికుమార్ అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



నెహ్రూ నగర్: జాతీయ స్థాయిలో సివిల్స్‌లో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కళ్యాణ్‌ను నగర మేయర్ రవీంద్ర అభినందించారు. మంగళవారం నగరపాలక సంస్థ మేయర్ చాంబర్‌లో చల్లా పవన్ కళ్యాణ్‌ను శాలువా, బొకేతో సత్కరించి అభినందించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన చల్లా సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 146వ ర్యాంకు సాధించటం ఎంతో అభినందనీయమన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగులు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉంటారని, వారు కుల,మత, పార్టీలకతీతంగా పేద ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. నేటి యువత చల్లా పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు.

భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థుల చొరవ



భవన నిర్మాణంపై ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు, దాతలు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలోని బీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు గదులు, వాటిపై సమావేశ మందిరం నిర్మాణానికి పూర్వ విద్యార్థులు చొరవ తీసుకొని పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించారు. మంగళవారం దాతలు, పూర్వ విద్యార్థులు పాఠశాలలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించే భవన నిర్మాణం గురుంచి సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు త్రిపురనేని రవి, భాస్కర్ అనే అన్నదమ్ములు పాఠశాలను సందర్శించి నూతన భవనం, మౌలిక సదుపాయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీబీ వెంకట్రావు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తాటి వీరయ్య, బూసిరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న శ్రీ లక్ష్మీ నరసింహుని కల్యాణం

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలో కొలువైయున్న శ్రీ పుష్యాద్రి లక్ష్మీ నరసింహుని క్షేత్రం, ఆకాశమల్లేశ్వరస్వామి క్షేత్రంలో ఈనెల 11న స్వామివారి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కల్యాణంలో భాగంగా స్వామివారికి సుప్రభాత సేవ, లలితా పారాయణం, పూలంగి సేవ, సహస్ర దీపాలంకరణ, రాత్రి 8 గంటలకు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం జరుగుతుందని అన్నారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, జరుగుతాయని.. మధ్యాహ్నం స్వామివారి తీర్థ ప్రసాద మహాన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కల్యాణం చేయించదలచిన భక్తులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

స్విమ్మింగ్ పూల్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కమిషనర్ శ్రీనివాసులు



స్విమ్మింగ్ పూల్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శ్యామల నగర్ మెయిన్ రోడ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను మంగళవారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత క్యాంప్‌కు ఎంత మంది వస్తున్నారు, నీటి నాణ్యతపై స్విమ్మర్లు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పూల్‌ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నిర్వహించాలని, లైటింగ్, నీటి ఫిల్టరేషన్ ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రథమ చికిత్స కిట్‌ని అందుబాటులో ఉంచాలని కోరారు. రద్దీ దృష్ట్యా మరో పూల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శ్యామల నగర్, వెంకటరమణ కాలనీ, పట్టాభిపురం ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రోడ్ల మీద, డ్రైయిన్‌లలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని, కమర్షియల్ సంస్థలను సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, బయాలజిస్ట్ రామారావు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ నేతలు, సభ్యులు

లక్ష్మీపురం: సీహెచ్‌ఓల సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సీహెచ్‌ఓల ఆందోళన తొమ్మిదో రోజుకు చేరింది. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి నగరంపాలెం మీదుగా గుర్రం జాషువా విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు విధులు నిర్వహించిన అనంతరం రెగ్యులరైజ్ చేస్తామని రాతపూర్వకంగా ఉద్యోగస్తులకు హామీ ఇచ్చి, నేడు దాన్ని అమలుపరచకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు సీహెచ్ చిన్న మాల్యాద్రి కుటుంబ సభ్యులు అంకమ్మకు ఎక్స్ గ్రేషియాకి సంబంధించి రూ.2 లక్షల చెక్‌ను మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న చిన్న మాల్యాద్రి అనారోగ్య కారణాలతో మరణించగా, వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని, మట్టి ఖర్చులు రూ.15 వేలను ఇప్పటికే ఇచ్చామని తెలిపారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, మీరావలి, చిష్టి, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిఎంహెచ్ఓ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

నేటి నుంచి కళా పరిషత్ నాటిక పోటీలు

పొన్నూరు: పొన్నూరు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని డా.నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్.నాజర్ శత జయంతిని పురస్కరించుకుని 24వ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి శనివారం వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. బుధవారం సాయంత్రం ప్రారంభోత్సవ సభ అనంతరం విడాకులు కావాలి, కిడ్నాప్ నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 8న చిగురు మేఘం, బ్రహ్మస్వరూపం, కన్నెగంటి హనుమంతు బుర్రకథ, 9న అసత్యం, దేవరాగం, 27వ మైలురాయి, 10న జనరల్ బోగీలు, కమనీయం నాటికలు ఉంటాయని అన్నారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

దివ్యాంగులకు మెడికల్ క్యాంపు నేడు

చేబ్రోలు: దివ్యాంగులు, వయో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించడానికి మెడికల్ క్యాంపు జరుగుతున్నట్లు చేబ్రోలు ఎంపీడీవో ఎ.ఉమాదేవి మంగళవారం తెలిపారు. పొన్నూరులోని ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగే మెడికల్ క్యాంపునకు మండలంలోని అన్ని గ్రామాల వారు హాజరుకావాలని కోరారు. దివ్యాంగులు, వయో వృద్ధులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు ఆదాయ ధృవీకరణ పత్రాల జిరాక్స్, మొబైల్ నంబరుతో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు

పట్నంబజారు: శివ భక్తుల కోసం పవిత్ర అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణకు సంబంధించి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. ఈనెల 12న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు 10వ తేదీ రాత్రి 9.15 గంటలకు బస్సు బయల్దేరుతోందని చెప్పారు. 11వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. 12వ తేదీ గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదే రోజు రాత్రి బయల్దేరి 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని అన్నారు. ఈ సర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెటు ధర రూ. 2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382897459 నంబరులో సంప్రదించాలని కోరారు.

హెవీ మోటారు డ్రైవింగ్‌స్కూల్ ప్రారంభం

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలో లైట్ మోటారు వెహికల్ లైసెన్సు కలిగిన డ్రైవర్లకు సంబంధించి హెవీ మోటారు డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మంగళవారం తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 19 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 20వ బ్యాచ్‌కు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు డ్రైవర్లు వారి పేర్లు నమోదు చేసుకోవాలని, కేవలం బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉన్నట్లు వివరించారు. ప్రతిరోజూ వాహనం విభాగాలు, వాటి పనితీరు, రోడ్లు, పెయింటింగ్ మార్కులతోపాటు, వాహనాన్ని నడిపించి శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డు, ప్రధాన రహదారుల్లో సైతం అనుభవం ఉన్న సీనియర్ డ్రైవర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఫామ్-5, 5ఏ, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతోందన్నారు. ఆర్టీఏ అధికారులు నిర్వహించే టెస్టులో పాల్గొని లైసెన్సు పొందవచ్చు అన్నారు. వివరాల కోసం 73828 94585, 88973 71003 నంబర్లలో సంప్రదించాలని కోరారు.